

# కొత్తవీధి కోయిల

గటాప వెంకటేశ్వర్లు

బ్రతుకు చివరివరకూ వెంటాడే తియ్యని కల ఒక్కబాల్యమే నేమో అన్పిస్తుంది. నిజమే.... మనిషికి బాల్యం ఒక వరం. బాల్యపు స్మృతులు తల్చుకుంటే ఎంతబాగుంటాయి ఆకాశంలో ఎగిరే రంగురంగుల గాలిపటాల్లాగా ఎంత మధురమైనవిచిన్నప్పటి రోజులు

చిన్నప్పుడు జరిగిన సంగతులు. తెలిసీ తెలియ వయస్సులో అనుభవించిన అనుభవాలు. ఇవ్వనీ తల్చుకుంటే ఒక పక్క ఆనందం, మరో పక్క అంతలేని విషాదం రెండూ ఒకసారి పెన వేసుకుంటాయి.

ఎప్పుడో జరిగిన సంఘటనల్ని తల్చుకుంటుంటే నిన్నో, మొన్నో జరిగినట్లుగా అన్పిస్తాయి. ఆ వయసు తల్చుకుంటుంటే తెలియని వింత అనుభూతి.

బ్రతుకులో స్థిరపడిపోయాక, కష్టాలు, కన్నీళ్ళు, నష్టాలు, నవ్వులు, బాధలు, బరువులు, పెళ్ళాం విసుర్లు, పిల్లల ఏడుపులు పెళ్ళి చేసుకున్నందుకు....వాళ్ళ కోసం బ్రతకడం........యాంత్రిక జీవితంలో ఏ తీయని స్వర్గాలేకుండా యేమిటీ బ్రతుకనిపిస్తుంది.

ఇదంతా జ్ఞాపకం రాకపోను.

కానీ నిన్నొచ్చిన వుత్తరం చూస్తే ఆశ్చర్యమేసింది. సాధారణంగా నాకు ఉత్తరాలు రావు. ఎందుకంటే నేనెవరికీ జవాబు వ్రాయను, అందుకని. గబగబా చదివాను. ఉత్తరంలో యెక్కువ విశేషాలు లేవు. ఒకే ఒక్క వాక్యం రాసుంది-అది.

“మన కొత్తవీధి కోయిలకి సీరియసగా వుంది.... వీలైతే రా” కింద శేష అని సంతకం వుంది.

ఎప్పటి జ్ఞాపకాలు. దాదాపు ముప్పయ్యేళ్ళ క్రితం విరబూసి.. వీచిన కమ్మని సుగంధాల గుబాళింపులు. అలా ఆఫీసు సీట్లో కూర్చుని ఆలోచిస్తూ వుండిపోయాను.

సింహాచలం.. ఎన్నాళ్ళయింది చూసి.. చిన్నప్పుడు ఎన్ని ముచ్చట్లని పంచింది. అక్కడ ప్రతిసందూ చిరపరిచితం తనకి.

హవేలీ బిల్డింగ్ అందులో రోజా మహల్ ...ఫ్లవర్‌గార్డెన్....వుద్యానవనం నర్తనశాల.... పెద్ద బావి.... గుమ్చీ........ పుష్కరిణీ.......సంస్కృత కళాశాల.... ఆగమ పాఠశాల....గోశాల.

అప్పట్లో తమ యిల్లు కొత్తవీధిలో వుండేది. అక్కడే నాయుస్కూల్లో తను చదివేవాడు. అప్పటి ఐదో తరగతి మిత్రులందరూ ఒక్కొక్కరూ జ్ఞాపకానికొచ్చారు. రామగోపాల్, భవానీప్రసాద్ సంజీవి, ఆనంద్, శేషకుమారి, రాజేశ్వరి, నాగేశ్వరి, శమంతకమణి చివరివాడు కొత్తవీధి కోయిల మా జగన్నాథం.

ఈ కలకత్తాలో స్థిరపడిపోయి యిరవై

---

**కష్టాల గతుకుల్తో నిండిన జీవితంలో కదులుతూన్న మనిషికూడా, మనసులో యెక్కడో కొత్త వీధి తళుక్కుమంటోవుంటుంది. ఆ కొత్త వీధి మలుపులోనుంచి కోయిల పిలుపు వినిపిస్తోనే వుంటుంది!**

## నెలకు రు. 1,000/-లు సంపాదించండి

ఎలక్ట్రిక్ గైడ్ 10/-. ఫొటోగ్రఫీ 10/-. ట్రాన్సిస్టర్ రేడియో గైడ్ 10/-. టైలరింగ్ & కటింగ్ 10/-. వైవాహిక జీవితం 100 చిత్రాలతో 10-/. మెడికల్ సెక్స్ గైడ్ 88 చిత్రాలతో 10/-. రేడియో గైడ్ 10/-. 300 కాటేజి ఇండస్ట్రీస్ గైడ్ 20/-. 350 ఎంబ్రాయిడరీ డిజైనులు 10/-. 1-80 పోస్టేజి ఒకొక్కదానికి అడ్వాన్సుగా పంపాలి.

**GUPTA BOOK CENTRE (A J)**
**Tamoli Para, Aligarh**

## గల్ఫ్ దేశాలలో ఉద్యోగం

మధ్య ప్రాచ్య దేశాలలో నేరుగా ఉద్యోగం పొందుటకు ఉచిత సాహిత్యం మరియు పూర్తి వివరాల కోసం స్వంత చిరునామాగల స్టాంపులు అంటించిన కవరుతో దిగువ చిరునామాకు వ్రాయండి.

Globe Service Information Centre (Regd.) (A-2)
**WZ-69, Nangli Jalib**
**New Delhi-110058.**

ఉచితము! ఉచితము!

## తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.

**Bharat Ayurvedashram**
**P.O. Katri Sarai (Gaya)**

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం

దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యం పొందలేనివార్కి హెర్నియా. చర్మవ్యాధులకు పోస్టుద్వారా వరిబీజం(బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్)మూత్ర,స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి

**డా॥ దేవర**
**5/1 బ్రాడీపేట, గుంటూరు. A.P.**


సంవత్సరాల పైగా అయింది. అందర్నీ కాదనుకుని, యెవర్నీ లక్ష్యపెట్టకుండా అనుకున్న అమ్మాయిని........ అలివేలుని పెళ్ళి చేసుకుని వచ్చేశాక మళ్ళీ సింహాచలం వెళ్ళటం యిదే.

జ్ఞాపకాల పెట్టెల్లో తీయని మధుర స్మృతుల్లాగా రైలు నాలాగే వుంది. అందరూ నిద్ర పోతున్నారు. నాకెందుకో నిద్ర పట్టటంలేదు. ఏవో తెలీని ఉక్కిరి బిక్కిరి ఆలోచనలు. నాతో చదువుకున్న వాళ్ళు సింహాచలంలో కొంతమందైనా వుంటారా,. నేను చదివిన స్కూలు వుందా.. వూరు మారి వుంటుందేమో.... నర్తనశాల అరుగుమీద హరికథలుజరుగుతుంటాయా....? అందర్నీ కాకపోయినా కొందర్నైనా కలవగలనా.. ముఖ్యంగా శమంతకమణినైనా.... సుబ్బారావు మాష్టార్ని.... ఏవిటో అప్పుడే విడిపోయి.. అప్పుడే కల్సిపోతున్న మేఘ సమూహంలా ఆలోచన్లు.

— నిద్ర రావటం లేదు.

చిన్నప్పుడు నిద్రలేనిరాత్రులు ఎన్నుందేవో.... భోగిపండుగ ముందు రోజు కర్రలకోసం గోపాలపట్నం బంజరు తోటకెళ్ళటం.... ఎవరికి నిద్రలుండేవి.... అయినా.. అప్పుడు నిద్రగురించి ఆలోచనేది ?

అమ్మవారి పండుగ ముందు రోజు వూరంతా దేదీప్యంగా దేవేంద్రనగరంలా శ్రీ నరసింహస్వామివారి కళ్యాణాలకు బుర్రకథలూ.... హరికథలూ.... నాటకాలూ.... యక్షగానాలూ....

చైత్రమాసంలో ఆ పండుగ వస్తే సరదా అంతా, ఇంతా కాదు. ఆ గమ్మత్తైన రోజులు తల్చుకుంటే .... అబ్బా బాల్యమే బ్రతుకంతాఐతేఎంతబాగుణ్ణు.... అన్పిస్తుంది ....ఎన్నెన్ని సరదాలు ....కోతికొమ్మచ్చులాటలు .... దాగుడు మూతలు .... అష్టాచెమ్మలు .... ఒకొక్కటి ఎన్నెన్ని తియ్యని జ్ఞాపకాలు.

సరిగ్గా ఉదయం ఎనిమిది గంటలకు సింహాచలం స్టేషన్లో రైలాగింది. నాతో తెచ్చుకున్న ఎయిర్ బేగ్‌తో ప్లాట్‌ఫారం మీదకి చిన్నపిల్లాడిలా గెంతాను.

స్టేషను మారింది.

బైటకొచ్చాను.

"రిక్షా బాబూ" రిక్షావాడు ముందు కొచ్చాడు. గోపాలపట్నంనించి వూళ్ళోకి నడుచుకుని వెళ్ళాలనిపించింది. అన్నీ చూడొచ్చు.. బేగ్ని భుజానికి తగిలించుకుని నడక ప్రారంభించేను. అక్కణ్ణించి మరో మూడు ఫర్లాంగులు నడవాలి.. సింహాచలానికి.

ఊరు బాగా మారిందనడానికి గుర్తుగా మొదట్లోనే పెద్ద ఆర్చి .... అందమైన పార్కు, జంక్షన్లో చమన్ .... దాంట్లో మెట్టతామర .... గులాబీలు .... రకరకాల పూలచెట్లు .... ఎప్పటిలా వయసు బరువు పెరిగి బాధ్యతల్తో ఉక్కిరిబిక్కిరైనట్లు... గుబురుగా .... ఏకాంతంగా వున్న గున్న మామిడి.

అది దాటితే విశాలమైన మైదానంలో సంస్కృత కళాశాల....ఆతరువాత చెక్కుచెదరని సంప్రదాయానికి .... ఆస్తికత్వానికి గుర్తుగా ఉద్యానవనం మంటపం.... సీతారాముల బొమ్మలతో ఇప్పటికీ అలాగే వుంది.

దారిలో కొత్తవీథి మొదట పెద్ద పెద్ద భవనాలు... నా కంతా గమ్మత్తుగా వుంది. వూరు చాలా మారింది. ఏవైనా తెల్సిన ముఖాలు కనబడతాయేమోనని... ఒక్క ముఖమూ కనబడలేదు.

—కొత్త వీథిలోకి నడిచాడు.

మొట్టమొదట కన్పించింది మా నాయ్డు స్కూలు...

ఊహ తెలీని వయస్సు నుంచీ తిరిగిన స్థలం. పెరిగిన స్థలం...ఇక్కడే ఆట్లాడుకున్నాం... కొట్లాడుకున్నాం, పాడుకున్నాం...తిట్టుకున్నాం... ఆ ప్రక్క గోడకానుకుని వున్న కొళాయి ప్రక్క వున్న మట్టికుండల్ని బద్దలుకొట్టి దెబ్బలు తిన్నాం.... వెనక గోడకి ఆనుకుని వున్న మామిడిచెట్టు కాయలు కోసి తిట్లుతిన్నాం.

ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు ? అవ్వన్నీ ఎక్కడి కెళ్ళిపోయాయి మబ్బుల్లా.. బాల్యమంతా ఎలా కరిగిపోయింది మంచులా.

ఒక్కరూ, ఒకొక్కరూ జ్ఞాపకానికొస్తున్నారు. రామగోపాల్.. ఎక్కడున్నాడో.. మా అందర్లో పెద్దవాడు. నన్ను భుజాల మీద ఎక్కించుకుని కిందపడేసేవాడు. ఏడిస్తే చిరుతిండి కొనిచ్చి వూరుకోబెట్టేవాడు.

సంజీవి బాగాచదివేవాడు. అల్లరెక్కువ. ఒకసారి మణి గౌను వెనక భాగాన బొద్దింక ను పడేశాడు. అదంటే ఎంత భయం మణికి. ఆ అమ్మాయి హెడ్‌మాస్టరుకి చెబితే ఆయన రూళ్ళకర్రతో కొడితే మేమంతా ముందు ఎంత సంతోషించినా తర్వాత ఎంత బాధపడ్డాం ?

ముఖ్యంగా జగన్నాథం...ఆ తర్వాత మణి...వీళ్ళిద్దరి గురించి చెప్పుకోవాలి.

ఐదో తరగతి తర్వాత హైస్కూల్లో మళ్ళీ మేం ముగ్గురం జట్టు. అందరూ తలో దిక్కు ఐపోయారు. స్కూల్

ఫైనల్ తర్వాత జగన్నాథం ఆగిపో యాడు చదివించేవాళ్ళులేక. నేనూ, మణీ... పి.యు.సి.లో జట్టు. పి.యు.సి. అయ్యాక మణీ మరి చదవలేదు.

అప్పట్లోనే, హైస్కూల్లో చదువు తున్నప్పుడే జగన్నాథం పాటలు పాడేవాడు. మాష్టర్లు వాడిచేత పాటలు పాడించి ముగ్ధులై వాడిని పొగుడుతుంటే .... ఎంత పొంగిపోయేవాణ్ణి! ఏ వేడుక జరిగినా వాడిని ఆహ్వానించడం, వెంటనే వాడు తయారవడం....వాడి వెనకే పరుగు.

మణీ వాళ్ళిల్లు సంస్కృత కళాశాల వెనక గోడకి ఎదురుగా వుండేది. సన్న జాజి పందిరి, బూడిదరంగు మేడ, కలిసి చదువుకోవడం వలన, క్లాసులో అందరి కంటే మార్కులు నాకే బాగా వస్తుండడం వలన ఆ అమ్మాయి నాతోనే ఎక్కువగా మాట్లాడేది. జగన్నాథం పాటలు పాడటం వలన, ఆ పాటలు మణికి ఇష్టం అవడం వలన, అతగాడితో కూడా మాట్లాడేది.

ఊహ తెలియక పూర్వం ఏమోగాని కొద్దిగా జ్ఞానం,ఆడా-మగా తేడా, స్నేహం అభిమానం, ప్రేమ, వీటర్థం తెలిసొచ్చే సరికి నేను హైస్కూలు చదువులో వున్నాను.

ఒకే వీధి, చిన్నప్పట్నించీ ఒకే దగ్గర చదవడం వలన మా ఇంటికి తను, తనింటికి నేనూ వెళ్తుండేవాళ్ళం. రోజూ అలాగే జరిగేది...కానీ అది అకస్మాత్తుగా ఒకసారి ఆగిపోయింది.

ఆ రోజు నే నెంతో బాధపడిపోయాను. గబుక్కున వాళ్ళింటి కెళ్ళాను. వాళ్ళింటి నిండా జనం. వాళ్ళమ్మగారు కనబడితే అడిగేను.

"మణేదంటే."


"అది మరి మీ ఇంటికి రాదు వెళ్ళు.."

నవ్వుతూ చెప్పారో, కోపంగా చెప్పారో నాకు తెలీదుకానీ ఆ సమయంలో నేనా మాటలకు చాలా బాధపడ్డాను. వెనక్కి వెనక్కి చూసుకుంటూ వచ్చేసేను.

దాన్తర్వాత –

స్కూలుకి వస్తుందనుకున్నాను.రాలేదు. మాన్పించేశారని తర్వాత తెల్సింది. నేనూ మానేద్దామనుకున్నాను. ఎలాగైనా మణీని "ఏమిటీసంగతి"ని అడుగుదామని ఆరోజు నిశ్చయించుకుని గుమ్మం దగ్గర అరుగు మీద కూర్చున్నాను.

నా కళ్ళు అకస్మాత్తుగా మణి కన బడ్డంతో తడబడ్డాయి. రోజూ చూస్తున్న మణే....మెల్లగా బిందెను చంకన పెట్టు కుని మా ఇంటి కానుకుని వున్న నూతి దగ్గరకు వచ్చింది.



సన్నగా, పొడవుగా, లేతకొబ్బరాకులా వుండే మణికళ్ళకి కొత్తఅందమొచ్చింది. ఆ మణి చెంప మెరుపులు గులాబీ కొత్త మెరుపుల్లా వున్నాయి. ముక్కుకి తెల్లటి ముత్యం, మెడలో వొంటిపేట బంగారపు గొలుసు. కొత్తగా పైట, లంగా, ఓణీ, కాళ్ళకు బంగారపు పట్టీలు.

చిన్నప్పుడు నేనంతా అయోమయం. క్లాసులో తెలివైనవాణ్ణే కానీ "లోకజ్ఞానం" లేదు. నేనానాడు మణిని అడిగిన ప్రశ్న నాకిప్పటికీ నవ్వు కలిగిస్తుంది.

"నువ్వు పెద్దమనిషివయ్యావనిగొప్ప.. నాతో మాట్లాడ్డం లేదు.. నేనూ రేపో ఎల్లుండో అవుతాన్లే ...."

మణి ఏమీ మాట్లాడలేదు. సంపెంగ పువ్వులా నవ్వింది. మణితోబాటు వున్న సామ్రాజ్యం.. రాజేశ్వరి.. అందరూ నవ్వేరు.

చంకన బిందె పెట్టుకుని వెళ్తున్న మణి రవివర్మ బొమ్మలా అనిపించింది.

రోజూ మా డాబా ఎక్కి చూసేవాణ్ణి మణి డాబా వైపు కనబడుతుందేమోనని. లేదు. ఎప్పుడో బట్టలు ఆరెయ్యడానికి వచ్చినపుడు కనబడేది. అలా చూస్తూ నిల్చునపుడు మణి నవ్వే కోటి ఏనుగుల శక్తి.

మణి నవ్వు గొప్పగా వుంటుంది. ఆ నవ్వుని కాళిదాసు చూస్తే "మణిక హాసం" అనే కావ్యం వ్రాసుండునేమో. అలా కొంతసేపు నిల్చుంటే బావుండేది అనుకునేవాణ్ణి. అంతలోనే వెళ్ళిపోయేది. మోకాళ్ళదాకా వ్రేలాడదీసిన త్రాచు పాములా కనబడేది జడ.

సెలవులు.

రోజుకొక సారయినా కనబడకపోతే మనసంతా చికాగ్గా, వర్షం వచ్చినట్టుగా దుఃఖం వచ్చేది.

అప్పుడే నేను మొదటిసారిగా తెల్సుకున్నాను.

"మణంటే ఇష్టపడుతున్నానని..."

కోలగా వుండే ఆ ముఖంలో అంతంత విశాలమైన కళ్ళను చూస్తే ఆ కళ్ళేకలలో కొచ్చేవి. సన్నగా, పొడవుగా ముక్కు.

దానికింద వంపులు తిరిగిన గడ్డం. కెరటాల్లా ఎగసిపడే జుత్తు. తనూ లావణ్యం....పిరుదల వరకూ వ్రేలాడే జడ. సన్నటి నడుం, పూత రేకుల్లోని తెల్లదనాన్ని తీసి చేసిన ధవళప్రతిమలా మణి.

నా వయసుతోపాటు మణిమీద ఆకర్షణ కూడా పెరిగింది. ఆ అమ్మాయికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని తెల్సింది. విలవిలా తోకతెగిన బల్లిలా ఐపోయాను.


ఆ రోజు నాకు బాగా జ్ఞాపకముంది.

ఆ రోజు స్వామివారి కళ్యాణం. జగన్నాథం భక్తి గీతాలు పాడుతుంటే వెనక కూర్చున్నాను నేను.

ఇంతట్లో మణి.

మెరుపు చూపుల్తో...నీలం చీరకట్టుకుని, లైటు వెలుగులో మణి నీలిపొడుల గాజుబొమ్మలా వుంది. ఆ అమ్మాయి నా వేపు చూడడంలేదు. జగన్నాథం వైపే చూస్తోంది. జగన్నాథం పాటనే తన్మయత్వంతో వింటోంది. ఆ అమ్మాయి చూస్తోందన్న వుత్సాహంతో వాడు గొప్పగా తన గళాన్ని విన్పిస్తున్నాడు. నేనది భరించలేకపోయాను.

ఎందుకో జగన్నాథమంటే నాకు తెలీని ద్వేషం ఏర్పడింది. ఎలాగైనా మణిని ప్రేమిస్తున్నానని చెప్పాలి. ఎలా? ఎలా?




మణికి జగన్నాథమంటే యిష్టం.. కానీ అతనన్నభిమానిస్తున్నందుకునాకుఅసూయ. వాడితో తిరగటం మానేశాను.

ఆ మర్నాడు తెప్పోత్సవం. జనం గుంపులు గుంపులుగా పుష్కరిణి చుట్టూ వున్నారు. ఆ జనం మధ్య నేను నన్చోటుకి పది అడుగుల దూరంలో మణి. వాళ్ళపిన్ని.. ఇంకెవరెవరో.

అక్కడికి వెళ్ళి నిలబడ్డాను.

నన్ను చూసి మణి కళ్ళని అటు తిప్పేసుకుంది. ఆమెతో యెలాగైనా మాట్లాడాలి.

ఆ ఖర్న .... బోటు పుష్కరిణి మంటపం చేరాక నేను మణి పక్కగా నడిచి "మణీ" అని పలకరించాను.

లైట్లు లేకపోవడం వలన మణి విశాలమైన కళ్ళ మెరుపు వెలుతుర్లాగే కనబడింది.

"మణీ.. నా గురించి నీ అభిప్రాయం ఏమిటి?" తర్వాతెప్పుడో ఆలోచించుకుంటే ప్రపంచంలో అంతకంటె తెలివి తక్కువ ప్రశ్న వుండదనిపించింది. కానీ ఆ సమయంలో మాత్రం గొప్ప ఆనందంగా అడిగాను.

"అభిప్రాయమంటే. దేనిగురించి..?"

"జగన్నాథమిష్టమా.. నేనిష్టమా.."

"అదా.." చిన్న నవ్వు నవ్వింది. నవ్వాక —

"జగన్నాథాన్ని చూశావా....అతనెంత కమ్మగా పాటలు పాడతాడో .... నువ్వు పాడతావా....నీ కవ్వేవీ రావు .... అంచేత జగన్నాథమంటేనే నా కిష్టం."

ఎందుచేత జగన్నాథమంటే ఇష్టమో చెప్పాక, మణంటే నా కెందు కిష్టమో చెప్పాను.

"నువ్వంటే నా కిష్టం .... నిన్నేను ప్రేమిస్తున్నాను మణీ...."

"నువ్వు మంచివాడి వనుకున్నా నిన్నాళ్ళూ...." ఆ మాట అనేసి ముందు కెళ్ళిపోయింది మణి.

మూన్రోజుల్నాడు వీధిలో కర్రాబిళ్ళా ఆడుతున్న నన్ను పిల్చి మావయ్య "వేలెడు వెధవ్వి...లాగు తొడుక్కోవడం రాని వెధవ్వి...తొమ్మిదో తరగతిలోనే పెళ్ళాం కావల్సొచ్చిందా...ప్రేమ కావల్సొచ్చిందా...?" అసలే కోపం మనిషి... చితక బాదేడు...నా మూతి ఆంజనేయుడి మూతిలా ఐపోయింది.

—ఆ తర్వాత ఓ రోజు...ఆ రోజు అమ్మా వాళ్ళు వెంకటరమణమూర్తి గుడి కెళ్ళారు.

నేనొక్కణ్ణే డాబాఎక్కి కూర్చున్నాను,

ఎదురుగా మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతున్నారు.

"శ్రీ.."ఆ పిలుపుకి పక్కకిచూశాను.

మణి మెట్లమీద నిలబడుంది. గబుక్కున పైకెక్కింది. ఆవేళ తెప్పోత్సవం తరువాత మళ్ళీ ఇవాళే చూడ్డం.

"ఆ వేళ తెలీక నువ్వన్న మాట మా అమ్మకు చెప్పాను. మాఅమ్మ మీఅమ్మతో మీ అమ్మ మీ మామయ్యకు చెప్పారట.. నీకు తగిలిన దెబ్బలకు నేనే కారణం.. ఏమనుకోకేం.." దగ్గరగా వచ్చి చేతులు పట్టుకుంది. వెడల్పాటి కళ్ళు, గులాబీ రేకుల్ని చింపి అద్దుకున్నట్లు బుగ్గలు.. వంకీలజుత్తు, పొడవాటి ముక్కు, ముత్యం పుడక సన్నటిమెడ.. చీరలో.. పసుపురంగు చీర.. ఆ వేళ మణి అప్పుడప్పుడు కన్పించి అకస్మాత్తుగా మాయమయ్యే ఇంద్రధనుసులా వుంది. అప్పుడే స్నానం చేసి వచ్చినట్టుంది. మైసూర్ శాండల్ పరిమళం వేస్తోంది.

పరాయి ఆడపిల్ల చేతులు పట్టుకోవడం అదే ప్రథమం.. సిగ్గుగానూ.. కితకితలుగానూ వుంది. ఒక పక్క ఎక్కడ వదిలేస్తోందోనని భయం.. ఆమె అరచేతులు మెత్తగా మల్లెపువ్వు రేకుల్లాగా వున్నాయి.

"నేనొకటి అడుగుతాను చెబుతావా.. మళ్ళీ అమ్మకు చెప్పేస్తావా.." నేను భయపడి అన్న మాటకో, లేకపోతే అమాయకత్వానికో చాలాసేపు కడుపు చేతితో పట్టుకుని నవ్వింది మణి.

నవ్వుతున్నపుడు మణి బాగుంటుంది. సన్నంగా, పొడవుగా వుండడంవలన బుగ్గమీద అకస్మాత్తుగా సొట్ట పడుతుంది. తెల్లటి పళ్ళవరుస ముచ్చటగా మెరుస్తుంది.

గాలికి వూగే కొబ్బరాకులా నవ్వుతోంది. నవ్వుతూనే అంది.

"ఎవరికీ చెప్పన్లే...చెప్పు..."

"నువ్వంటే నా కిష్టం...ప్రేమ... మరి..."ఇంకేదో అనబోయాను.

మసక చీకటిపడుతున్న ఆ సమయాన...ముసుగు పెట్టుకున్న ఆకాశం... ఎదురుగాసంస్కృత పాఠశాల మర్రిచెట్టు మీంచి వచ్చేగాలి, దూరంగా హవేలీభవంతి మీదనుంచి ఎగురుతున్న పావురాలు.. పక్కింటి పున్నాగ పువ్వుల వాసన.. విచ్చుకుంటున్న మల్లెమొగ్గలగుబాళింపు.. వీధిలో అమ్మాయి కళ్ళాపి జల్లుతున్నపుడు మోగుతున్న పట్టీల శబ్దం— ఇవ్వన్నీ నేను పట్టించుకున్నానో లేదో నాకుతెలీదు.. కానీ మణి నన్ను ఒక్కసారి వెనవేసుకుని నన్ను గట్టిగా అదుముకున్నపుడు.."నువ్వంటే నాకిష్టం..శ్రీ.." అని అన్నపుడు నా కొక్కసారి ఆనందమూ, తర్వాత మామయ్య వస్తాడనే భయమూ.. వేశాయి. ఆ తర్వాత మణి బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాను.

"వెళ్ళొస్తాను.." విడిపించుకుని వెళ్ళిపోయింది.

చాలా సేపు అలా వుండిపోయాను. డాబాగోడ నానుకుని.. చీకటి మణి వత్తైన జుత్తులావుంది. మణిరావడం, ముద్దివ్వడం.. వెళ్ళిపోవడం అంత గమ్మత్తుగా వేసంకాలం సాయంత్రం సముద్రం ఒడ్డున కూర్చున్నంత హాయిగా, కొబ్బరి నీళ్ళు త్రాగుతున్నంత చల్లగా... చలికాలంలో వేణ్ణీళ్ళు పోసుకున్నంత వెచ్చగా వుంది.

—నా కాలేజీ చదువైపోయింది. యూనివర్శిటీలో ఫస్టు టర్మ్ అయింది. సెలవులకి ఇంటికొచ్చినపుడు... మణిని కలిసినపుడు "నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు..." అంది.

"చూస్తే...నిన్ను నేనే పెళ్ళి చేసుకుంటాను...ఎవరొప్పుకున్నా...ఒప్పుకోకపోయినా...నువ్వు నాతో వచ్చేస్తావా..." విడిపోయేముందు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయింది మణి.

వైజాగులో నా పోస్టు గ్రాడ్యుయేషన్ ఐపోయింది. సింహాచలం వచ్చేశాను. ఆ వేళ మణితో మాట్లాడాలి అనుకుని నూతి దగ్గరకొచ్చి.."మధ్యాహ్నం సినిమాకని" రమ్మన్నాను. ముందు రానంది తర్వాత.. "ఎక్కడకు రావాలి" అంది.

ఇద్దరం శ్రీనివాస్ నగరం చేరుకున్నాం. పాడుపడిన భవనం నిశ్శబ్దంగా వుంది. ఎక్కడో, ఏ గుడ్లగూబో అరుస్తున్న చప్పుడు....తప్ప మిగతా అంతా చూస్తే ఆ విశాల ఏకాంత సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్న రాణీ....రాజుల్లా కూర్చున్నాం.

మణి చిలకాకుపచ్చరంగుచీర కట్టుకొని అదేరంగు జాకెట్టు వేసుకుంది. ఆకుపచ్చ ప్రకృతి మధ్య వాటిని శాసించే ప్రకృతి కన్యలా వుంది.

"ఎందుకు రమ్మన్నావ్?"

"నీకు తెలీదా?"


"మణీ! మనం ఎలిమెంటరీ స్కూల్లో చదివినగ్గర్నించీ నేను తెల్సు.. అప్పణ్ణించీ నువ్వంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. ఇష్టం. ఆ ఇష్టాన్ని నువ్వే ప్రేమగా మార్చావు.. నాకు నేడో, రేపో ఉద్యోగం రాకపోదు.హాయిగా వుండొచ్చు నాతో వచ్చేయ్."

"ఆహా.. వచ్చేయ్.. ఎంతచక్కగా అన్నావు. మా అమ్మ, నాన్నలకు నేనొక్కత్తినే.. నేన్నీతో వచ్చేస్తే.. మా అమ్మ గుండె ఆగిపోతుంది...మా నాన్న బి. పి. ఎక్కువైపోతుంది.. అదీగాక ముఖ్యంగా...నాకు ధైర్యంలేదు...వేర్వేరు కులాలు... మీ వాళ్ళు కులం పట్టించుకోకపోయినా... మావాళ్ళు మాత్రం.... నీకు అంతగా నమ్మకం లేకపోతే మా నాన్నగారిని అడిగి చూడు..."

తర్వాత—

"మాది నిప్పులాంటి వంశం...మా వాళ్ళు పూర్వం జమీందారుల్లా బ్రతికిన వాళ్ళు...పల్లెలకు పల్లెలే దానం చేసిన వాళ్ళు...అలాంటి గొప్ప కులంలో పుట్టి ఆఖరికి కులభ్రష్టత్వానా... నాలుగు ముక్కలొచ్చి నంతమాత్రాన మామూలు వాడు... మా కులపోడౌతాడా.." మణి నాన్న మాటలవి.

అలాగ మణి విడిపోయింది. తర్వాత



ఏమైందో తెలీదు. నాకు కలకత్తాలో ఉద్యోగం వచ్చింది. కలకత్తా వచ్చే ముందు చిన్ననాటి మిత్రుల్లో కొంత మంది స్టేషను కొచ్చి దిగబెట్టారు. అందులో జగన్నాథం లేడు. ఏండని అడిగేను.

"ఇంట్లో వాళ్ళన్నయ్య కొడితే వూరు విడిచిపోయాడని" చెప్పారు. అంతే మరి కలవలేదు వాణ్ణి.

* * *

మా నాయుడు స్కూలు ముందు ఎంత సేపు నిలబడ్డానో తెలీదు. బాల్యమనే జ్ఞాపకాల ఆల్బాన్ని అతికించుకుందా స్కూలు.

"జగన్నాథం పాటలు పాడేవాడు. ఇల్లెక్కడుందో తెల్సా." ఎవర్నో అడిగేను.

"తెల్సు, మీ రెవరు, ఎక్కణ్ణుంచొస్తున్నారు....?"

"ఒరేయ్..నేనూ..సంజీవిని.." ఇద్దర్నీ యిద్దరం పోల్చుకోనంతగా మారిపోయాం.. నా చేయి తన చేతిలోకి తీసుకుని నా బేగ్ తను భుజానికి తగిలించుకుని దారంటా పచ్చని కబుర్ల తోరణాలు.

"ఎలా వుంది జగన్నాథానికి.."

"ఎలా వుంటుంది.. బతకడు..ఇవాళో.. రేపో.." వాళ్ళింట్లో బేగ్ పడేసి బైల్దేరేం.

రెండోవీధి పైడితల్లి అమ్మవారి గుడి దాటాక.. ఒక కమ్మల ఇల్లు గట్టిగా వర్షం కురిస్తే కూలిపోటానికి సిద్ధంగా వుంది.

వంగొని చూరుదాటి లోనికెళ్ళాం.. గుమ్మంలోని ఓ పక్క మంచమ్మీద నల్లటి దుప్పటి.. దాని మీద బక్క చిక్కిన జంతువులా ఆ వ్యక్తి పడుకుని వున్నాడు. ఎముకలన్నీ పేర్చి ఇంకా ప్రాణం పొయ్యనట్టుగా వున్నాడు. తెల్లగా జుత్తు. బాగా పెరిగిన గడ్డం.

"అన్నీ మంచమ్మీదే బాబూ.. చూసే దిక్కులేదు.." అప్పటి వరకూ చూడనే లేదు. సత్తు గ్లాసుతో ఏదో తెస్తూ అందావిడ.

ఎవరన్నట్టు చూసేన్నేను సంజీవివేపు.

"జగన్నాధం పెళ్ళాం.." చెప్పాడు వాడు నెమ్మదిగా.

అక్కడే వున్న స్తంభాని కానుకుని నేలమీద కూర్చున్నాను. పక్కకు తిరిగాడు. గాజు కళ్ళలాంటి కళ్ళను చీల్చుకుని అందర్నీ ఒకసారి చూసి.. తల పక్కకు వాల్చేశాడు. అదే ఆఖరు.

"నిన్ను చూడ్డానికే బ్రతికున్నాడ్రా.." నాకేడుపొచ్చింది. నేనూ.. సంజీవి.. మరి కొంత మంది దహనసంస్కారాలు పూర్తి చేశాం. ఆ వీధిలో మరెవ్వరూ వాడి శవాన్ని చూడ్డానికైనా రాలేదు.

నాకాశ్చర్యం వేసింది. కారణం సంజీవిని అడగటానికి సమయం లేకపోయింది.

మనసంతా చికాగ్గా అయిపోయింది. "రెండ్రోజులు,... వుండమని" సంజీవి బలవంతం చేశాడు. వుండలేదు. మర్నాడే బయల్దేరిపోయాను. వచ్చేముందు సంజీవి చేతిలో వంద రూపాయలు పెట్టి ఆవిడకిమ్మన్నాను. సంజీవి నాతో నడుస్తున్నాడు.

దార్లో శ్రీనివాస్ నగర్ వచ్చాక సంజీవిని అకస్మాత్తుగా అడిగేను.

"చివరి సమయంలో దిక్కుమాలిన వాడిలాగా ఐపోయాడు. పాపం జగన్నాథానికి అన్నలూ, చిన్నన్నలూ వుండి ఎందుకొదిలేశారు."

"నీకు తెలీదా...."

"ఏంవిటి...."

"తెల్సేమో అనుకున్నా....నిజంగా తెలీదా....మనతో చదువుకుంది శమంతకమణి.... జ్ఞాపకం వుందా...." అడిగేడు. తెలుసన్నట్టు తలూపేను.

"నిన్న చూశావుగా.. జగన్నాథం పెళ్ళాం..మణే.."

నమ్మలేకపోయాను.

"ఇదెలా అయిందంటే... అప్పట్లో మంచి సంబంధం చూసి...మణికి పెళ్ళి చేశాడు వాళ్ళనాన్న. మొగుడిది యల మంచిలి... పెళ్ళయ్యాక ఆర్నెల్లు కనుకుంటాను... వాడు నాకిష్టంలేదని తిరిగొచ్చేసింది...ఐదేళ్ళు ఇంట్లోనే వుంది. తర్వాత జగన్నాథంతో రాకపోకలు... ఆ తర్వాత వాడే వుంచేసుకున్నాడు. పెద్ద కులం—పెద్ద కులం అనుకుంటూ వాళ్ళ నాన్న గుండాగిపోయాక, వీధివాళ్ళ మాటలు పడలేక వాళ్ళన్నయ్యవాళ్ళు తల్లితో విజయవాడ వెళ్ళిపోయారు. అప్పటికే జగన్నాథం బాగా పాడైపోయాడు. ఏదో జబ్బు.. వీణ్ణి అందరూ వదిలేశారు. ఆఖరికి మణి ఏదో చిన్న వుద్యోగం చేస్తూ వాణ్ణి పోషించు.."

"మరి చెప్పవు.." కోయిలలా బతికిన జగన్నాథం. పున్నమిలా వెలిగినమణికాలం వడపోతకు ఇలా మిగిలారా? మరొక్కసారి మణిని చూడాలనిపించింది. కాని వెనక్కి వెళ్ళాలనిపించలేదు.

—తర్వాత నే నెప్పుడూ సింహాచలం వెళ్ళలేదు. వెళితే మణిని ఏ పరిస్థితిలో చూడాల్సొస్తుందోనని భయం.

కానీ నా చిన్నతనం జ్ఞాపకాని కొచ్చినప్పుడు....ఆ బాల్యంలో మా బామ్మగారు చెప్పిన కథల్లో దేవలోకపు అప్సర కాంతలు..వాళ్ళ బంగారంవంటి సొగసులు..బృందావనంలోని కృష్ణుడు వూదిన వేణుగానపు మంజుల నాదాలూ..మబ్బుల్లోంచి తప్పించుకుని చుక్కల పక్కన చేరిన చల్లని చూపుల చంద్రుడు..వీటితో పాటు మణి గుర్తుకొస్తుంది. ఈ కలకత్తాలో..అమాయకపు చూపుల్తో.. పొడవుగా..కన్పించే బెంగాలీ అమ్మాయిలూ.. మాయ తెలీని మనసులా, మెరిసే విక్టోరియా మెమోరియల్ హాలు, జూలో జంతువుల్ని చూస్తున్నపుడు అదీ, యిదీ తెలీని ఆనందం, గొడియా హాల్లో తిరుగుతున్నపుడు వేసే సరదా.. స్టానెట్ దగ్గర నిలబడ్డప్పుడు కనబడే దృశ్యాలూ.. ఇవన్నీ చూస్తున్నపుడు కలిగిన భరించలేని ఆనందంతో నా కళ్ళెంట కన్నీళ్ళొస్తాయి. అప్పుడూ మణి గుర్తుకొస్తుంది. కొత్తవీధి కోయిలా గుర్తుకొస్తాడు.

## ప్రాదుర్మతి ఈ దుర్మతి

కంటకాల నెదిరించే
కథ చెపుతోంది గులాబి
మంటల నార్పే, గాన
మధువు ఒందుతోంది మాలి —

మోడుబారినట్టి వనికి
మోదము కుసుమించునట్లు
చేయును గీతాబోధ
కోయిల వేదాంతి — కంట॥

జైత్రయాత్ర సాగించే
జనశక్తికి జై జై అని
చెట్టు చెట్టుపై చైత్రము
పచ్చ పచ్చ జండాలు — కంట॥

దోపిడీలు దుండగాలు
పాపాలిక తగ్గునని
పంచాంగము పఠించును
ప్రగతివాద పక్షులు — కంట॥

చేదు తీపి కలిపి పాడు
ప్రాదుర్మతి ఈ ఉగాది
సమతా నవతానంద
సరసజీవన వినోది — కంట॥

— జె. బాపురెడ్డి